క్లుప్తంగా

రైతులకు పరికరాల పంపిణీ



రైతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ వంశీ

రంపచోడవరం: ఉద్యానవన శాఖ గిరిజన రైతులకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ కుంజం వంశీ అన్నారు. రంపచోడవరం మండలం గోపవరంలో మంగళవారం ఉద్యానశాఖ ద్వారా రైతులకు మందులు, పరికరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీటీసీ మాట్లాడుతూ గ్రామంలో ఇరవై మంది రైతులకు పరికరాలు, మందులు పంపిణీ చేశారని, వీటిని సద్వినియోగం చేసుకుని, అధిక దిగుబడి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు బాపన్నమ్మ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ పండా రామకృష్ణదొర, పీసా కార్యదర్శి బందం రవి, మాజీ సర్పంచ్ శారపు బాపిరాజు, ఉద్యానశాఖ సిబ్బంది నాగరాజు, బందం ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని సర్పంచ్ వెంగడ రమేష్ అన్నారు. సుజనకోట సచివాలయం వద్ద మంగళవారం రైతులకు సర్పంచ్ రమేష్,ఎంపీటీసీ సుబ్బలక్ష్మి వరి విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన రైతులు లాభాలు వచ్చే పంటలపై దృష్టి పెట్టాలన్నారు.రాయితీలపై అవసరమైన విత్తనాలు నిత్యం రైతులకు అందుబాటులో ఉంచాలని ఆయన వ్యవసాయ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు,సచివాలయ సిబ్బంది,గిరిజన రైతులు పాల్గొన్నారు.

పుస్తకాలు, స్టడీమెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న భాగ్యవతి సేవా సంఘం సభ్యులు

ముంచంగిపుట్టు: విద్యార్థి దశలోనే క్రమ శిక్షణ అలవర్చుకోవాలని జర్రెల సర్పంచ్ నాయకం భాగ్యవతి అన్నారు. కర్రిముఖిపుట్టు పంచాయతీ వెచ్చంగి ఎంపీపీఎస్ పాఠశాలలో మంగళవారం భాగ్యవతి సేవా సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ భాగ్యవతి సొంత సొమ్ముతో 25 మంది విద్యార్థులకు బుక్స్,స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలని, మొక్కుబడిగా కాకుండా ప్రణాళికాబద్ధంగా చదువు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయరాం,ఝాన్సీ,సేవ సంఘం సభ్యులు పూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ చినబాబు

రాజవొమ్మంగి : అసాంఘిక కార్యకలాపాలకు అందరూ దూరంగా ఉండాలని జడ్డంగి ఎస్‌ఐ చినబాబు తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో భాగంగా గడుఓకుర్తి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా పోలీసులను సంప్రదిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దని హితవు పలికారు. సారా, గంజాయి రవాణా వంటి కార్యకలాపాల్లో పాల్గొవద్దని సూచించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కొత్తవారు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

డుంబ్రిగుడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్టు డుంబ్రిగుడ ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు బాకా ఈశ్వరి అధ్యక్షతన ఈసమావేశం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం



ముంచంగిపుట్టు వెలుగు కార్యాలయం సమీపంలో పేరుకుపోయిన చెత్త



ముంచంగిపుట్టు ఎంపీడీవో క్వార్టర్స్ వద్ద చెత్త మధ్య పాడైన చెత్త సేకరణ రిక్షాలు

పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. అరకులోయ నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో పరిస్థితి దారుణంగా ఉంది. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. మురుగు కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లో వినియోగించిన నీరు రోడ్లపై నిలిచిపోతోంది. పట్టించుకోవాల్సిన అధికారులు కన్నెత్తి చూడడం లేదు. వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు
- సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని ప్రజల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

ముంచంగిపుట్టు:మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది.రోడ్డు పక్కన,వీధుల్లో కుప్పలుగా చెత్త పేరుకుపోతోంది. పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్త తొలగింపులో చిత్తశుద్ధి కరువవుతోంది.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్వచ్ఛ సంకల్పం పేరుతో వాహనాలు ఏర్పాటు చేసి చెత్తను ప్రతి రోజు తొలగించేవారు.ప్రస్తుతం చెత్తను సేకరించే వాహనాలు పాడై మూలకు చేరాయి.దీంతో పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని రోజులుగా 23 పంచాయతీల్లో పలు గ్రామాల్లో చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. మండల కేంద్రం ముంచంగిపుట్టులో వెలుగు కార్యాలయం సమీపంలో దుకాణదారులు అధికంగా చెత్తను పడేస్తున్నా రు. జీసీసీ గోదాం ఎదుట,మండల కేంద్రం నుంచి జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో గ్యాస్ గోదాం వద్ద,ఎంపీడీవో క్వార్టర్స్,హోలీ క్రీడ మైదానం,అంబేడ్కర్ పార్కు ఇలా పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు దోమల బెడదతో పరిసర ప్రాంతాల వాసులు సతమతమవుతున్నారు.



అరకులోయ అల్లూరి సీతారామరాజు అతిథిగృహం పక్క రోడ్డులో పేరుకుపోయిన చెత్త

దోమల కారణంగా రాత్రి కునుకు కరువు అవుతోందని,రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముంచంగిపుట్టు మండలంలో చెత్త సేకరణ కోసం కేటాయించిన రిక్షాలు పూర్తిగా పాడైపోయి వినియోగించేందుకు వీలు లేకుండా తయారయ్యాయి.

మండల కేంద్రంలో దుకాణాల ముందు ఎటువంటి డస్ట్ బిన్నులు లేవు.దీంతో దుకాణదారులు వేసిన చెత్త రోడ్లపై పేరుకుపోతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, పారిశుధ్య



పెదబయలు సీడీపీవో కార్యాలయం ఎదుట పేరుకుపోయిన చెత్త



శరభగుడ రహదారిలో ...

చర్యలు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో పలు వీధుల్లో చెత్త పేరుకుపోయింది. అల్లూరి సీతారామరాజు పబ్లిక్ స్కూల్ అతిథి గృహం నుంచి జెడ్పీ కాలనీకి వెళ్లే రహదారితో పాటు శరభగుడ, ఐసీడీఎస్ కార్యాలయం సమీపంలోని రహదారి వద్ద చెత్త పేరుకుపోయింది. ఈ రహదారికి ఆనుకుని విశాఖ పోర్టు గెస్ట్ హౌస్ ఉన్నప్పటికీ అతిథిగృహ నిర్వాహకులు సైతం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన పంచాయతీ అధికారులు స్పందించి వీధుల్లోని ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన చాపరాయి జలపాతం వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పేరుకుపోయాయి. పర్యాటకులు తీసుకువస్తున్న ప్లాస్టిక్ బాటిళ్లు, పాలిథిన్ కవర్లను పరిసర ప్రాంతాల్లో పడేస్తున్నారు. దీంతో చాపరాయి ప్రవేశం వద్ద, వాహనాల పార్కింగ్ ప్రదేశంలో నిత్యం చెత్త దర్శనమిస్తోంది. ఇక్కడ ఉన్న ఇద్దరు పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తను సమీపంలోనే పడేస్తుండడంతో నిత్యం దుర్గంధం వెలువడుతోంది. దీంతో పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. చాపరాయి పరిసరాలను శుభ్రం చేయించాలని వారు కోరుతున్నారు. అన్ని గ్రామాల్లో పరిస్థితి ఇలాగే ఉంది. అధికారులు పారిశుధ్యంపై దృష్టి సారించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పెదబయలు సీడీపీవో కార్యాలయం సమీపంలో తిరగబడి ఉన్న చెత్త కుండి



చాపరాయి వద్ద పేరుకుపోయిన చెత్త

పెదబయలు: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం క్షీణించింది. దీంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రం పెదబయలు సీడీపీవో కార్యాలయం ఎదుట చెత్త పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో దోమల బెడద అధికమైంది. పలు చోట్ల డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తోంది.ఐటీడీఏ రెంటల్ కాలనీలోని డ్రైనేజీలు పూడుకుపోయాయి. పెదబయలు వారపు సంత ప్రాంతంలో పాలిథిన్ కవర్లతో పాటు టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతోంది. పెదబయలులో డంపింగ్ యార్డ్ లేకపోవడంతో పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను వేర్వేరు ప్రాంతాల్లో వేస్తున్నారు. ఉన్నతాధికారులు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి



ముంచంగిపుట్టులో రోడ్డు పక్కన ఎక్కడికక్కడ కుప్పలుగా చెత్త పేరుకుపోయింది.రోజుల తరబడి తొలగించకపోవడంతో పాటు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వస్తోంది.రాకపోకలు చేసేవారంతా ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. తక్షణమే అధికారులు స్పందించి చెత్తను తొలగించి.పారిశుధ్యం మెరుగుపర్చాలి.

– ఎం.ఎం.శ్రీను, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు, ముంచంగిపుట్టు

సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలు



వలిసె విత్తనాలు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త బయ్యపురెడ్డి



మొండిగెడ్డలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ బోయిన కుమారి,సర్పంచ్ అడపా ప్రియాంక

గూడెంకొత్తవీధి: సేంద్రియ వ్యవసాయం రైతులకు ఎంతో మేలు చేస్తుందని చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త బయ్యపురెడ్డి తెలిపారు. రింతాడ పంచాయతీ దుచ్చరిపాలెంలో 30 మంది రైతులకు ఆయన మూడేసి కిలోల చొప్పున వలిసె విత్తనాలను పంపిణీ చేశారు.వాటితో పాటు జీవన ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం వైపు రైతులను మళ్లించేందుకు వీలుగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. సేంద్రియ వ్యవసాయం వల్ల భూమిని,పర్యావరణాన్ని,పక్షులు,జంతువులను కాపాడవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ అధ్యక్షుడు సాగిన భీమేశ్వర పడాల్,రైతులు సాగిన జోగి పడాల్,రాంబాబు,వంతల గోపి,బంగారాజు,లక్ష్మి పడాల్ తదితరులు పాల్గొన్నారు.

- మొండిగెడ్డలో ఎంపీపీ బోయిన కుమారి రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సర్పంచ్ అడపా ప్రియాంక తదితరలు పాల్గొన్నారు.

జన్ భాగీదారి అభియాన్‌తో గిరిజన గ్రామాల అభివృద్ధి

గంగవరం : జన్ భాగీదారి అభియాన్‌తో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని రంపచోడవరం ఐటీడీఏ ఏపీవో జనరల్ డి.ఎస్.వి. రమణ అన్నారు. మంగళవారం దొరమామిడి గిరిజన గ్రామంలో ఎంపీడీవో వై.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ధర్తి ఆబ జన్ భాగీదారి అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో ఐటీడీఏ ఏపీవో రమణ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 30 వరకు 15 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గిరిజన సంక్షేమశాఖ మిషన్ లక్ష్యాలను ఆయన వివరించారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 211 గ్రామాల్లో వివిధ గిరిజన తెగలకు అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు.

దొరమామడిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, సర్పంచ్ పండా చంద్రకళ, ఎంపీటీసీ పి.ఆదినారాయణ, ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏపీవో రమణ

కందుల సేవలు మరువలేనివి

ఎటపాక: సీపీఎంకి కందుల శ్రీనివాస్ చేసిన సేవలు మరువలేనివని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఐవి అన్నారు. మంగళవారం శ్రీనివాస్ నాలుగవ వర్ధంతి సందర్భంగా నందిగామలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఐవి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవ చేసిన కందుల అందరికీ ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తానికొండ వాసు, సీపీఎం నాయకులు పులుసు బాలకృష్ణ, సూర్యనారాయణ,సతీష్,నాగేంద్ర, సత్యనారాయణ,కోటేశ్వరరావు,రాము తదితరులు పాల్గొన్నారు.



స్థూపం వద్ద శ్రీనివాస్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

దస్తావేజులేఖర్లు, స్టాంప్‌వెండర్ల ఆందోళన



చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు, స్టాంప్‌వెండర్లు

చోడవరం : పేపర్‌లెస్ డాక్యుమెంట్ విధానం వద్దంటూ దస్తావేజు లేఖరులు, స్టాంపు వెండర్లు ఆందోళనకు దిగారు. చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వీరంతా మంగళవారం నిరసన తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం కొత్త విధానాల అమలుకు యోచించడాన్ని దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు వ్యతిరేకించారు.

పేపర్‌లెస్ డాక్యుమెంట్ విధానం పెడితే అనేక అవకతవకలు జరిగి ప్రజలకు చాలా నష్టం, ఇబ్బందులు కలుగుతాయన్నారు. ప్రజల ఆస్తులకు భద్రతపోతుందని, అందువల్ల డాక్యుమెంట్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చారు.ఆందోళనలో వద్దాది రమేష్, కె.నారాయణరావు, బొబ్బిలి శేఖర్ పాల్గొన్నారు.

19 మోడల్ ప్రైమరీ పాఠశాలలు మంజూరు

హుకుంపేట: మండలానికి 19 మోడల్ పాఠశాలలు మంజూరైనట్టు ఎంఈవో సోమెలి చెల్లయ్య తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 213 ప్రభుత్వ పాఠశాలలకు గాను 19మోడల్ ప్రైమరీ పాఠశాలలు మంజూరైనట్టు చెప్పారు. మోడల్ పాఠశాలల్లో నాలుగు నుంచి ఐదు మంది ఉపాధ్యాయులు ఉంటారని చెప్పారు.ఈ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించి, విద్యార్థుల సంఖ్య బట్టి అదనపు భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. మోడల్ పాఠశాలల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించనున్నట్టు ఆయన చెప్పారు.

భూసారం పెంపుపై దృష్టి సారించాలి



ముల్లుమెట్టలో పొలాలను పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

చింతపల్లి: గిరిజన రైతులు పంట భూముల్లో భూసారాన్ని వృద్ధి చేయడంపై దృష్టిసారించాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కొమ్మంగి పంచాయతీ పరిధిలో గల ముల్లుమెట్టలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పంట పొలాల్లో భూసారం పెంచే విధంగా రైతులకు జనుము,పిల్లిపెసర,జీలుగు వంటి విత్తనాలను పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర స్థాయి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న జానకీరాంపురం గ్రామస్తులు

గొలుగొండ : జానకీరాంపురంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. సీతారాముల ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఈ ఊరేగింపు నిర్వహించారు. బుధవారం సీతారాముల కల్యాణంతో పాటు, ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గొలుగొండ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సభ్యులు, అధికారులు కలసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ గజ్జలపు మణికుమారి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్య సమస్యలు లేకుండా అన్ని గ్రామాల్లో వైద్య పరీక్షలు చేస్తున్నట్టు వైద్యాధికారి శ్యామ్ తెలిపారు.

గొలు గొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు మాట్లాడుతూ గ్రామాల్లో దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేయించాలని కోరారు. ప్రతి గ్రామంలో నూరు శాతం జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించడం జరుగుతుందని ఏపీవో సూర్యమణి తెలపగా కంఠారం సర్పంచ్ బిడిజాన రాజేశ్వరి కంఠారం గ్రామ పంచాయతీలో తీర్మానం లేకుండా వీఆర్‌పీని ఎలా నియమించారో తెలపాలని డిమాండ్ చేశారు.

ప్రజలను వంచించిన కూటమి సర్కార్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ తదితరులు



పెదబయలులో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే రెండింతలు అధికంగా పథకాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ ఆరోపించారు. జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని వారు మంగళవారం మండల కేంద్రం డుంబ్రిగుడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లికి వందనం పేరుతో చంద్రబాబు వంచన చేశారన్నారు. రాష్ట్రంలో 87 లక్షల మంది తల్లులు ఉంటే 54 లక్షల మందికి మాత్రమే ఈ పథకం ఇచ్చారని మండిపడ్డారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, కించుమండ ఎంపీటీసీ విజయ, గుంటసీమ, పోతంగి, కితలంగి, కురిడి సర్పంచ్‌లు గుమ్మ నాగేశ్వరరావు, వెంకటరావు, సుబ్బారావు, లచ్చు, రామమూర్తి, మాజీ ఎంపీటీసీ మహాదేవ్, మండల మహిళ అధ్యక్షురాలు బి.శాంతి, బబిత, మండల కార్యదర్శి మఠం శంకర్, సోషల్ మీడియా కన్వీనర్ నరసింగరావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

పెదబయలు: కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు డిమాండ్ చేశారు. జగన్ అంటే నమ్మకం చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని స్థానిక గాంధీ బొమ్మ కూడలిలో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందన్నారు. తల్లికి వందనం పథకం మంజూరులో భారీగా కోత విధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు నియోజకవర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు సందడి కొండబాబు, మండల ఉపాధ్యక్షుడు పల్టాసింగి విష్ణుమూర్తి(ధనరాజ్),జామిగుడ సూపర్ సర్పంచ్ తెరవాడ వెంకటరావు, సీనియర్ నాయకులు కొమ్మ బాలరాజు, మండల కార్యదర్శి జుంబు పూర్ణయ్య, బొండా కర్యాపురాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా రాజవొమ్మంగి - ఏలేశ్వరం మార్గం

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగి నుంచి ఏలేశ్వరం వెళ్లే మార్గం ప్రమాదభరితంగా మారింది. అడుగడుగునా గోతులు దర్శనమిస్తున్నాయి. గోతుల కారణంగా వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జిల్లాలోని రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం, కొయ్యూరు తదితర మండలాల ప్రజలు ఏలేశ్వరం వెళ్లాలంటే నానా ఇబ్బంది పడుతున్నారు. ఈ రూట్‌లో గొంటువానిపాలెం నుంచి రమణయ్యపేట వరకు రహదారి పూర్తిగా ఛిద్రమైంది. రోడ్డు నిండా పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఏ మాత్రం వర్షం పడినా రహదారి చెరువును తలపిస్తుంది. ఎక్కడ గొయ్యి ఉందో.. ఎక్కడ రాళ్లు ఉన్నాయో తెలియని పరిస్థితుల్లో వాహన చోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రాజవొమ్మంగి నుంచి 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఏలేశ్వరం వెళ్లాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని ప్రయాణించవలసి వస్తోందని వాహన చోదకులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాదిగా వాహనాలు తిరుగుతాయని, అయితే ఎప్పుడూ మరమ్మతులతో ఉండే ఈ రహదారిలో అత్యవసరంగా ఏలేశ్వరం వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు తెలిపారు. మన్యంలోని ఐదు మండలాల ప్రజలకు ఉపయోగపడే ఈ రోడ్డును మెరుగుపరచాలని కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న రోడ్డు